# పిల్లల్ని కూడా అడిగి చూడండి!

ఈ ఒకే రకం బట్ట నలుగురూ కుట్టించుకుంటారో లేదో, పిల్లల్ని కూడా అడిగి చూడండి! కిందటిసారే మీరు తెచ్చిన బుష్‌కోట్ బట్ట నలుగురూ కుట్టించుకుని వేసుకుంటే "ఏంట్రా? బేండు గ్రూపు తయారయిందా? అని ఎగతాళి చేశారట! చిన్నబుచ్చుకున్నారు పిల్లలు. ఆ బుష్‌కోట్లు ఒకరు వేసుకున్నప్పుడు ఇంకొకడు వేసుకోకుండా జాగ్రత్తపడుతున్నారు" అంది ఇందుమతి.

"చాల్లేవోయ్! ఎవడో పిల్లాడు ఏదో అన్నాట్ట! దాన్ని పెద్ద సీరియస్‌గా తీసుకుని మన పిల్లలు నీకు చెప్పడం, నువ్వు నాకు చెప్పడం బాగానే వుంది. ఏకంగా తానుకొంటే కాస్త చవకగా కలిసొస్తుంది. అది చూసుకోవాలిగానీ పిల్లలూ మీకిది కొనమంటారా? ఒద్దంటారా? అని వాళ్ల పర్మిషన్ తీసుకుని కొనాలా?" అని రుసరుసలాడారు కోటేశ్వరరావుగారు.

"ఏదో కాస్త కలిసొస్తుందని, వాళ్ల చిన్ని మనసుని ఎందుకండీ కష్టపెట్టడం? వేసుకునేది వాళ్లు. వాళ్లు తృప్తిగా వుంటే కదా మనకైనా బాగుండేది?" అంది ఇందుమతి.

"వాళ్లనడుగుతే అసలీ కాటన్ గుడ్డలే ఒద్దు టెరీకాటన్ కొనమంటారు. లేదా సిల్కు కొనమంటారు. కొంటామా? పెద్దవాళ్లం. మనకి నచ్చినవి మనం కొంటాం. అంతేగానీ వాళ్లనడిగి కొనాలన్న సిద్ధాంతం నాకు నచ్చదు. పెద్దవాళ్లు చేసే పనిని పిల్లలు హర్షించేలా వుండాలిగానీ వొంకలు పెడుతూ పెద్దలని అవమానించేలా వుండకూడదు" కోపంగానే అన్నారు కోటేశ్వరరావుగారు.

"అంత మాట లెందుకండీ? పిల్లలది నాజూకైన మనస్తత్వం. అది మనం తెలుసుకోవాలి. ఆ లేత మనసుల్లో ఉదయించే ఆలోచనలని పెద్దలు

తెలుసుకుంటున్నారూ, వాటికి విలువ నిస్తున్నారూ అని తెలిస్తే పొంగిపోతారు. వారి ఆలోచనలకి ఇంకా పదును పెట్టడానికి ప్రయత్నిస్తారు. పెద్దవాళ్ల మెచ్చుకోవాలని తహతహ లాడతారు. వాళ్ళ సలహాలను మనం ఆదరించాలి! అప్పుడు వాళ్లలో ఉత్సాహం రెట్టింపవుతుంది. కసురుకుని పొమ్మంటే నిరుత్సాహ పడిపోతారు."

"నీ మొహం! లేనిపోనివి ఊహించి చెప్పకు!" కోటేశ్వరరావుగారు ఇందుమతిని కసురుకున్నారు.

"ఊహించుకుని చెప్పడమేమిటి? ఇది సత్యం. పిల్లల్లో ఆత్మాభిమానం పెద్దవాళ్లకున్నంతా వుంటుంది. నన్నడిగితే ఇంకాస్త ఎక్కువే వుంటుంది. కోప్పడితే చిన్నబుచ్చుకుని బిక్కుబిక్కుమంటూ వుంటారు కొందరు. అలుగుతారు కొందరు. ఏది ఏమైతేనేం? బాధపడతారు అందరూ!"

"అలా అని పిల్లల్ని నెత్తి కెక్కించుకుంటే సరి. వాళ్లనడిగి సంసారం చెయ్యాల్సొస్తుంది. ఇంతకీ వాళ్లకేం తెల్సని..."

"అంతా తెలుసు. ప్రేమించిన వాళ్లని ప్రేమించాలని తెలుసు. ద్వేషించే వాళ్లని ద్వేషించాలని తెలుసు. వాళ్లకి తెలిసిన విషయాలను మనం చక్కగా ఇంకా వివరించి చెప్పడం మన ధర్మం. మొగ్గలా ఉండేవాళ్ల ఆలోచనల్ని పుష్పింప జెయ్యాలి పెద్దవాళ్లు. అంతేకానీ తుంచిపారేసి రెచ్చకొట్టకూడదు వాళ్లని. నలుగురిలో అవమానం పొందితే మనమెలా బాధపడతామో ఆ చిన్ని మనసులూ అలాగే బాధ పడతాయి. కాకపోతే ఆలోచనలకి పరిపూర్ణత్వం లోపిస్తుంది కాబట్టి ఉద్రేకం హెచ్చుపాళ్ళలో ఉంటుంది. పూర్తి అవగాహన ఏ విషయంలోనూ పర్‌ఫెక్ట్‌గా వుండదు కాబట్టి సరైన నిర్ణయాలు తీసుకోలేరు. చిగురుటాకులు వీరు. పసిడిమొగ్గలు వీరు."

నిజమేననిపించాయి ఇందుమతి మాటలు కోటేశ్వరరావుగారికి. ఎప్పుడో ఏదో మాటమీద డాక్టర్ శేషగిరిరావు గారన్నట్టు గుర్తు! పిల్లల్లో అందరికీ ఒకే బట్టలు వెయ్యడంవల్ల, వాళ్ల వ్యక్తిత్వాలు మారతాయట. అంటే వారి వారి

స్వభావంకాక, అందరూ అందరిలోకీ పెద్దవాడెవరో వాడిలాగే వుండడానికి ప్రయత్నిస్తారట! అంటే వాళ్లలో 'ఇండివిడ్యువాలిటీ' డెవలప్ కాదన్న మాట!

"సరేలే! సాయంత్రం మనతోబాటు వాళ్లనీ బజారుకి తీసికెళ్దాం. వాళ్లకి కావలసినవే వాళ్లని కొనుక్కోనీ!"

"మన బడ్జెట్ ఎంతో ముందుగానే పిల్లలకీ చెప్పాలి. అందులోనే ఎంపిక చేసుకోమని చెప్పాలి. అలా వారికి ప్రోత్సాహ మివ్వడంవల్ల వాళ్లలో ఉత్సాహం పెరుగుతుంది. ఆలోచన పెరుగుతుంది. ఒక రకమైన బాధ్యత కలుగుతుంది! నేటి పాపలే రేపటి పౌరులు! అనుభవం వస్తుంది. ఒకవేళ వాళ్లు తప్పులు చేస్తూవుంటే వాళ్ల కర్థమయ్యేలా వివరించి చెప్పాలి. అలా చెయ్యకూడదని అది మంచిది కాదని చెప్పాలి!"

"కరెక్ట్! పెద్దలకంటే పిల్లల విషయంలోనే ఎక్కువగా జాగర్తపడాలి!" వారి ఆత్మాభిమానం దెబ్బ తినకుండా చూడాలి. వారి చిన్ని మనసు గాయపడకుండా చూడాలి."

"అబ్బా! మీరొప్పుకున్నారు! నాకు ఎంతో సంతోషంగా వుందో!?" అంది తృప్తిగా నిట్టూరుస్తూ ఇందుమతి.

*